# బలహీనత

ఆసుపత్రికి తూర్పు కొనలో ఒక మెడికల్ వార్డు ఉంది. దానికి దగ్గరగానే నా గది. ఆ వార్డు పక్కనుంచే నా గదిలోకి రాకా పోకా. మంచాలు మారకపోయినా రోగులూ, వాళ్ళ వెంట వచ్చినవాళ్ళూ ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటారు. కొత్త కొత్తవాళ్ళు నాకు ఎదురౌతూ ఉంటారు. వాళ్ళ మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో ఎంతో వైవిధ్యం ఉన్నా అందరినీ పెనవేసుకున్న ఒక సమధర్మం నన్ను ముగ్ధుణ్ణిచేసి, తరుచూ తాత్త్వికమైన ఆలోచనల వలయంలోకి లాక్కుపోతూ ఉంటుంది. అది వాళ్ళ మధ్య నాకు కనిపించే ఒక అనురాగ బంధం.

రోగి వార్డులో చేరినప్పుడు అతని మనసులో ఏదో చెప్పలేని ఆందోళన ఉంటుంది. తన మూలంగా తన వాళ్ళంతా శ్రమ పడి పోతున్నారన్న సంకోచం కనుపిస్తుంది. కోలుకుని తిరిగి తన వాళ్ళతో కలిసి ఇంటికి పోతున్నప్పుడు అతని కళ్ళలో ఏదో ఉత్సాహం. తృప్తి చూడగలుగుతాం.

రోగిని వార్డులో చేర్పించి, అతనిని కంటిరెప్పల్లా చూసుకుంటున్న వాళ్ళలో కూడా ఎంతో సున్నితమైన భావాలు వ్యక్తమౌతూ ఉంటాయి. రోగి బాధపడుతూ ఉంటే చూసి సహించలేక ఆ బాధను చేత్తో తీసి తనమీద వేసుకుని భరించగల అవకాశం కలిగించలేదని దైవాన్ని తిట్టుకుంటూ, విలవిలలాడి కన్నీరు కారుస్తున్న బంధువు బేలతనానికి అప్పుడప్పుడు నేను నవ్వుకోవలసి వస్తుంది. రోగి ఆరోగ్యంగా తేరుకుని ఇంటికి వెళ్తున్నప్పుడు బంధువుల కళ్ళలో కురిసే వెన్నెల వెలుగుల మీద కవిత్వం కూడా చెప్పవచ్చుననిపిస్తుంది.

అయితే నా పరిశీలనకూ, సూత్రీకరణకూ కట్టుపడని అపవాదులా వార్డులో గోడ వార మంచానికి అతుక్కుపోయిన వ్యక్తి, అతని దగ్గర ఉన్న మనుషులూ కొంతకాలంగా నాకు ఎదురవుతూ ఉండటం వల్ల నాలో ఏదో జిజ్ఞాస చోటు చేసుకుంది. రెసిడెంట్ మెడికల్ ఆఫీసరుగా నాకు వార్డులోని రోగులతోనూ, వాళ్ళను చూసుకుంటున్న వాళ్ళతోనూ సన్నిహిత సంబంధం ఉండే అవకాశం లేదు. వార్డు ఇన్‌ఛార్జి, స్పెషలిస్టులూ, సిస్టర్లూ వాళ్ళని చూసుకుంటూనే ఉంటారు. అయితే గోడవార నేను చూసిన వ్యక్తికీ, అతని మంచం దగ్గర కూర్చుని గట్టిగా మాట్లాడుతూ హడావిడిగా ఉండే ఒకరిద్దరు పెద్ద మనుషులకూ మధ్య ఎటువంటి పొంతనా కనిపించకపోవడం నా జిజ్ఞాసకు కొంతవరకు కారణమైంది.

తెల్లగా చలువ చేసిన ధోవతులూ, పొడుగు చేతులున్న తెల్లటి లాల్చీలూ, చేతి వేళ్ళకు రవ్వల ఉంగరాలూ, బుగ్గమీసాలూ, నిత్యం నములుతున్న మసాలా తాంబూలంతో గారకట్టిన పలువరుసా, చూపుల్లో అధికార దర్పం, ఇవే స్థూలంగా ఆ పెద్ద మనుషుల్లో నాకు కనుపించిన

లక్షణాలు. ఎన్నెన్నో ఎండలకు కమిలి నల్లబడ్డ శరీరం, నిర్లిప్తంగా శూన్యంలోకి చూస్తున్నట్లున్న కళ్ళూ, కనుకొలకుల్లో ఏదో బ్రతుకు భయం, సందేహం ఇవే ఆ గోడవార మంచానికి అంటుకుపోయి నీరసించిన వ్యక్తిలో నాకు కనిపించిన లక్షణాలు. వీళ్ళని పెనవేసుకుని ఉండవలసిన మమతా బంధం ఎంత వెతికినా నాకు కనిపించకపోవడం కూడా నాలోని ఉత్కంఠకు కొంత కారణమైంది. నిర్లిప్తంగా, నీరసంగా ఉన్న వ్యక్తిని చూశాక గతంలో నేను 'జీవితం' అన్న పదానికి చెప్పుకున్న భాష్యాన్ని నెమరువేసుకోక తప్పలేదు.

నీళ్ళు నమలకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పడం ఒక దురలవాటు. దానికి శిక్షగా నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో నన్ను కసిగా మన్య ప్రాంతాల్లోనే తిప్పింది నా డిపార్ట్‌మెంట్. అందుకు నేను చేతులు జోడించనూలేదు, విచారించనూలేదు. మూటా ముల్లే కట్టుకుని నా భార్యతో ఆ మన్యాల్లోనే తిరిగాను. ఆ ప్రాంతాలలో ఒక విచిత్రమైన మైత్రీభావం పెంచుకున్నాను. అక్కడ మొలిచిన గడ్డీ గాదరా, చెట్టూ చేమా, మొక్కా మోడూ చేవ గలిగి నాకు ఏదో సందేశమిస్తున్నట్లుగా ఉండేవి. జీవితానికి భాష్యం చెప్పేవి. కాస్త వానలు పడితే చాలు, పెంకుటిళ్ళమీద కూడా ఒత్తుగా గరిక మొలిచి అవి పెంకుటిళ్ళా పచ్చని పర్ణశాలలా-అన్న భ్రమ కలిగేది.

ఒకమారు ఒక సవరజంట అడవి నుంచి పచ్చి మొద్దులు కొట్టి, నెత్తిన పెట్టుకుని నా క్వార్టర్స్ ముందునుంచే అమ్ముకుందుకు పోతోంది.

"మన క్వార్టర్స్ చుట్టూ చాలా జాగా ఉంది. పాదులు పెట్టి కూరగాయలు పండిద్దాం. పందిళ్ళు వేస్తే మంచిది" అంది నా భార్య.

ఏవో ఛలోక్తులతో, హుషారుగా హంసల్లా పోతున్న ఆ జంటను

పిలిచి, ఆ పచ్చి రాటల్ని కొని పందిళ్ళు వేయించాను. కొన్నాళ్ళ తర్వాత నా ఆశ్చర్యానికి అవధి లేదు. నేను పందిరి రాటలుగా పాతించిన పచ్చి మొద్దుల్లో రెండు రాటలు నేలలో వేళ్ళు తన్ని చిగురు పెట్టి నవనవలాడుతూ చెట్లయిపోయాయి. ఎక్కడో కొండల్లోంచి కొట్టుకుని తెచ్చిన మొద్దులు ఇక్కడ నేల తగలగానే మళ్ళీ జీవం పోసుకుని 'మేం బ్రతుకుతాం' అంటూ చెట్లయి కూర్చున్నాయి. రెండు చెట్లనూ చూస్తే ఉల్లాసంగా పోయిన ఆ సవర జంట జ్ఞాపకం వచ్చేది- నాకూ, నా భార్యకూ. నేను బ్రతకాలి అన్న కోర్కె అణువణువులో తొణికిసలాడడమే ఆరోగ్యకరమైన జీవితానికి సంకేతమని ఆనాడు అనుకున్నాను.

ఇన్నాళ్ళకు ఈ ఆసుపత్రికి బదిలీ అయి వచ్చాక ఈ పాత అనుభవాలు నెమరువేసుకోవడానికి నేను చూసిన వార్డులోని ఆ గోడ వార మంచంమీద ఉన్న వ్యక్తే కారణం. అతన్ని వార్డులో చేర్పించిన వాళ్ళనూ, వాళ్ళ అట్టహాసాన్నీ చూస్తూ ఉంటే ఏదో చిక్కు ప్రశ్న ఎదురైనట్లనిపించింది.

ఒక రోజు ఉదయం ఆ మంచం దగ్గరకు వెళ్ళి నీరసంగా ఉన్న మనిషిని నెమ్మదిగా తట్టి "ఏ ఊరు?" అన్నాను.

అతను నావేపు చూసి ఏదో పెదవి కదిపే ప్రయత్నంలో ఉన్నాడు. పక్కనున్న ఉంగరాల పెద్దమనిషి కలగచేసుకుని ఏదో గూడెం పేరు చెప్పాడు.

"అతన్ని చెప్పనివ్వండి" అన్నాను కాస్త అసహనంగా.

"వాడికి మాట్లాడేటంత బలం ఎక్కడిదండీ? అలవాటైన మాకే సరిగ్గా వినపడవు వాడి మాటలు" అన్నాడా పెద్దమనిషి.

కాస్త విసుగ్గా అతన్ని చూసి, ప్రశాంతంగా మంచంమీద వ్యక్తిని ఉద్దేశించి "రాత్రిపూట నిద్ర బాగా పడుతోందా?" అని అడిగాను.

"అసలు కునుకన్నదే ఎరగడు. రోజురోజుకూ బలహీనం అయి పోతున్నాడు" అంటూ ఆపకుండా చెప్పుకుపోతున్నాడు ఇంకొక పెద్ద మనిషి.

ఆ ఇద్దరు స్థూలకాయులమీదా నాకు జుగుప్స కలిగింది ఎలాంటి రోగినైనా ఆప్యాయంగా పలకరించి 'నువ్వు రోగివి బలహీనుడివి' అన్న సూచన ఏ మాత్రం అతనికి అందించకుండా, చిన్న చిన్న ప్రశ్నలు వేసి, అతన్ని మెల్లగా మాట్లాడించి, ఒక రకమైన మైత్రీ బంధం ఏర్పరచుకుని ఆ తర్వాత రోగ లక్షణాలు విశ్లేషించడం, రోగం గురించి అంచనాలు వెయ్యడం సరియైన చికిత్సా విధానంలో భాగాలని గట్టిగా నమ్మేవాణ్ణి నేను స్థూలకాయులిద్దరూ నాకూ, ఆ మంచంమీద వ్యక్తికీ పదేపదే అడ్డు తగలడం, వాళ్ళు మాట్లాడే ప్రతి వాక్యంలోనూ రోగి, రోగం, బలహీనం అని పునరుక్తి చెయ్యడం నేను సహించలేక పోయాను. ఇది సమయం కాదని నేను వాళ్ళతో మాటలు కలపకుండా వెళ్ళిపోయాను.

మరి రెండు రోజుల తర్వాత నా గదిలో కూర్చుని ఏవో రిపోర్టులు చూసుకుంటున్నాను. సిస్టర్ వార్డు బాయ్ గంగుల్ని పట్టు కుని గట్టిగా దులుపుతోంది. "ఆ గోడ వార మంచం దగ్గర అందరు మనుషులు రోజూ రావడం దేనికి? రాత్రంతా ఒకటే మాటలు. ఇది మెడికల్ వార్డనుకున్నారా బజారనుకున్నారా? పక్కనున్న రోగుల్ని విశ్రాంతిగా కంటి నిండా నిద్రపోనివ్వడంలేదు. నువ్వు ఆ పెద్దమనుష

లకు కిళ్ళీలూ, సిగరెట్లూ తేవడానికి వార్డు విడిచి వెళ్ళిపోతూ ఉంటావ్ - వాళ్ళ ఊర్లో ఎలక్షన్లు ఏమైతేనేమిటి ఇక్కడెందుకు అందర్నీ ఊదర గొట్టడం?" అని గంగుల్ని మందలించడం నా చెవిన పడుతున్నాది. నాకు ఆ పెద్దమనుషులమీద జుగుప్సా-మంచంమీద వ్యక్తి విషయంలో జిజ్ఞాస పెరుగుతూ వచ్చింది.

ఒక మధ్యాహ్నంవేళ వార్డు పక్కనుంచి పోతూ అలవాటుగా అటువేపు చూశాను. ఎందుచేతనో, ఆ సమయంలో అక్కడ రోజూ ఉదయం కనుపించే పెద్ద మనుషులు లేరు. మంచంమీద పడుకున్న వ్యక్తి శూన్యంలోకి చూస్తున్నాడు. నేను వెళ్ళి నుదుటి మీద చెయ్యి వేశాను.

అతను కంగారు పడి కదిలి కూర్చోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. శ్రమ పడవద్దని చేత్తో సౌంజ్ఞ చేసి వారించాను. కేస్ షీట్‌కు సిస్టర్ పిన్ చేసిన టెస్టు రిపోర్టులు చూశాను. నేను ఊహించినట్లే డిప్రెషన్‌లో ఉన్నాడు.

అతన్ని నాకు సుముఖంగా చేసుకుంటూ చిన్న చిన్న ప్రశ్నలు వేసి, తల ఊపించి అవునూ, కాదూ అన్న జవాబులు రాబట్టుకున్నాను. ఒకటి రెండు మాటలుకూడా నూతిలోంచి వచ్చినట్లు అతని గొంతుకలోంచి వినిపించాయి. మాటలు నీరసంగా ఉన్నా ఎంతో స్పష్టంగా ఉన్నాయి.

"నిన్ను చేర్పించి నీ దగ్గర కూర్చుంటూ ఉంటారు - వాళ్ళు నీకేమి అవుతారు?" అని అడిగాను.

నీ కేమి అవుతారని ఏదో బంధుత్వాన్ని సూచిస్తూ నేను ప్రశ్నించడమే ఒక మహాపరాధం అన్నట్లు కంగారు పడుతూ— "వారు

భూస్వాములు. నాకేమీ కారు. అప్పులు ఇప్పిస్తారు. ఆదుకుంటారు." అన్నాడు.

"సరేలే. విశ్రాంతి తీసుకో. నీ ఆరోగ్యంలో ఏ దోషం లేదు. కొద్ది రోజుల్లో కోలుకుంటావు" అని ధైర్యం చెప్పి వెళ్ళిపోయాను.

"నిజమేనా" అని అడిగినట్లు నా కళ్ళలోకి బేలగా చూశాడు.

ఆ తర్వాత ఎన్నోసార్లు అటుగా నేను వెళ్ళవలసి వచ్చినప్పుడు, అతని దగ్గర ఆ పెద్దమనుషులు లేని సమయాల్లో అతన్ని పలకరించి ఆరోగ్యంలో మంచి మలుపు కనిపిస్తోందని ధైర్యం కల్పిస్తూ వచ్చాను. అతని కళ్ళల్లో క్రమంగా వస్తున్న కొత్త వెలుగు నన్నెంతో ఆశ్చర్య పరచింది. ఒకనాటి మధ్యాహ్నం మంచంమీద ఒక్కడూ కూర్చుని పొరుగున ఉన్న మంచంమీది రోగిని స్నేహంగా చూస్తున్నాడు. అతను మంచం మీద కూర్చుని ఉండగా నేను చూడడం అదే మొదటి సారి. తోటి మనుషుల జీవితాలు గురించి ఉత్సాహం చూపించడం, బాహ్య ప్రపంచంతో సంబంధం కలిగించుకునే ప్రయత్నం చెయ్యడం చూసి సంతోషించాను.

"నీకు ఎటువంటి ప్రమాదకరమైన రోగం, భయంకరమైన అంటు వ్యాధీ లేదు. నీకు ఏమీ తోచకుంటే అలా మంచాని కంటుకు పోకుండా కాస్త రెండడుగులు నెమ్మదిగా వేసి చూడు" అని చెప్పి భుజం తట్టి; సిస్టర్‌తో కూడా రెండు మాటలు చెప్పి వెళ్ళిపోయాను. అలా నాకూ, అతనికీ మధ్య స్నేహం పెంచుకున్నాను.

ఒక వారం రోజుల తర్వాత నా గదిలో కూర్చుని పై అధికారులకు పంపవలసిన రిపోర్ట్స్ చూసుకుంటున్నాను. ఏదో నీడ లాగ తలుపు దగ్గర కదలాడితే తల ఎత్తి అటుగా చూశాను. నా రూమ్‌లోకి

తొంగి చూశాడు - ఆ వ్యక్తి - ఏదో పొరపాటు చేసినట్లు అక్కడనుండి వెళ్ళిపోబోతున్నాడు.

నేను గుర్తించి లోనికి రమ్మనమని సౌంజ్ఞ చేశాను. అడుగులు లెక్క పెడుతున్నట్లు నెమ్మదిగా వచ్చి నిలబడ్డాడు. కుర్చీలో కాస్త సహాయం చేసి కూర్చోబెట్టాను. ఇదివరలో నేను చూడని ఉత్సాహం' చొరవా అతని కళ్ళలో కనిపించాయి. ప్రజల్లో పడుతున్నందుకు తృప్తిపడ్డాను.

రెండు రోజుల తర్వాత వార్డులో పెద్దగా జరుగుతున్న కలకలానికి, గోలకూ గదిలోంచి వచ్చి అటుగా చూశాను. ఉంగరాల పెద్ద మనుషులిద్దరూ సిస్టర్‌తో వాదన పెట్టుకుని గొంతుచించుకుని అరుస్తున్నారు.

"ఇంత నిర్లక్ష్యమైతే ఎలా? ఆ రోగి అసలే శక్తిలేక బలహీనంగా ఉన్నాడు. మంచం వదలి ఒక్కడే అటూ ఇటూ తిరుగాడుతూ ఉంటే నీకు ఏమీ పట్టనట్లుంది. కళ్ళు తిరిగి పడితే ఎవరు బాధ్యులు: పైకి కంప్లైయింట్ ఇస్తాను" అని ఒకడు బెదిరిస్తున్నాడు.

తన మూలంగా జరుగుతున్న ఈ రభసకు భయంతో మంచానికి నీరసంగా కరుచుకుపోయాడు నా మిత్రుడు. నేను చూస్తూ సహించలేక అక్కడికి వెళ్ళాను.

"సిస్టర్‌ని ఏమీ అనకు. నువ్వు చేసే గగ్గోలుతో వార్డులోని వాళ్ళందర్నీ కలవర పరుస్తున్నావ్. నేనూ పదిమందిలోని వాడినని ధైర్యంగా నీ మనిషి నాలు గడుగులు వేస్తే అది ఆరోగ్యమైన మలుపే కాని, అవలక్షణం కాదు. రోజూ ఉదయం లేచింది మొదలు అతని

చుట్టూ చేరి బలహీనుడు - రోగి అని సహస్ర నామ సంకీర్తన చేసి అడుగడుగునా భయపెట్టి అతన్ని మీ రంతా మానసికంగా కుంగతీస్తున్నారు. ముందు వార్డులోంచి బయటకు నడవండి. తర్వాత మీకు చిత్తం వచ్చినట్లు పైకి రిపోర్టు చేసుకోండి" అన్నాను

నా గదిలోకి వెళ్ళిపోయానే కానీ నా మనస్సులో ఎన్నో చిక్కు ప్రశ్నలు.

ఈ పెద్ద మనుషులు నిజంగా కోరేది ఏమిటి? ఆ మంచం మీద వ్యక్తి ఆరోగ్యమా - బలహీనతా? తనువూ- మనసు చిక్కగా పెనవేసుకుని రూపుదిద్దుకొన్న వ్యక్తికి చికిత్స అవసరమైనప్పుడు మనసును ఉపేక్షించడం ఎలా సాధ్యం? రోగి, బలహీనుడు అని పదే పదే సూచనలతో జ్ఞాపకం చేస్తూ ఒక వ్యక్తిని ఉద్ధరించడం ఎలా? అలా చికిత్స చెయ్యమని ఏ మనస్తత్వ శాస్త్రం చెప్తుంది. ఏ చికిత్స విధానం సమర్థిస్తుంది? ఇలాంటి ప్రశ్నలు నన్ను వేధించాయి. బరువైన ఆలోచనలతో ఆ సాయంత్రం క్వార్టర్స్‌కి వెళ్ళిపోయాను.

ఒక సాయంత్రం నా క్వార్టర్స్ పైన డాబా మీద కుర్చీ వేసుకుని కూర్చుని నీలాకాశంలోకి, చూస్తున్నాను. ఏవో పక్షులు బారులు తీరి గూళ్ళకు తిరిగి పోతున్నాయి. వైమానిక విన్యాసాలు జ్ఞాపకం తెప్పిస్తూ అవి ఒక పద్ధతిలో ఎగురుతూ పోతూ ఉంటే చూస్తున్నాను. దగ్గరలో ఉన్న స్కూలు పక్కన కాసింత స్థలం ఉంటే ఇద్దరు పిల్లలు అక్కడ బంతితో ఆడుకుంటున్నారు. మిగతా పిల్లలంతా ఇళ్ళకు పోయినా వీళ్ళిద్దరూ ఇంకా ఆట ధ్యాసలోనే ఉన్నారు. ఆడుతూ ఆడుతూ పోయి, ఒక పిల్లవాడు పునాదుల కోసం తవ్వించిన గుంటలో పడిపోయాడు.

నేను అయ్యో అనుకున్నాను. ఆడుకుంటున్న ఆ పిల్లలిద్దరికీ కూడా ఎంతో ఉత్సాహ భంగమై ఉంటుంది. గుంటలో పడ్డ కుర్రవాడు తనంత తానుగా మీదికి రాలేనంత లోతుగా ఉంది ఆ గుంట.

నేను మెట్లు దిగి వెళ్ళబోయేలోగా ఆ పిల్లలిద్దరూ చొరవగా ఆ చిన్న సమస్యను పరిష్కరించుకోవడం చూస్తే నాకు చాలా ముచ్చట వేసింది. ఇద్దరూ పదేళ్ళ లోపు ప్రాయంలో ఉన్నవాళ్ళే. గుంటలో ఉన్నవాడు ఒక చేత్తో గట్టును అదిమి పట్టుకుని తన భారం అంతా పూర్తిగా పై నున్న వాడి మీద పడకుండా చూస్తూ రెండవ చేతిని అందిస్తున్నాడు. గట్టు మీది కుర్రవాడు ఆ చేతిని పట్టుకుని గట్టిగా గుంజి సహాయం చేశాడు. ఇలా ఇద్దరూ మళ్ళా ఒకటై ఇంకొంత సేపు బంతితో ఆడుకున్నారు. తర్వాత ఆనందంగా పుస్తకాల సంచులు మోసుకుంటూ ఎవ రిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇద్దరూ ఒకటై ఆటల్లోని ఆనందాన్ని పంచుకోవాలన్న ఆరాటం ఉంది.

మన సామాజిక వ్యవస్థ ఈ పసితరాన్ని ఇలా సహజంగా, ఆరోగ్యంగా వికసించ నిస్తుందా? ఈ పసివాళ్ళ ఆటలూ, పాటలూ చూసి ఈ తరం పెద్దలు తమ ఆలోచనా సరళిని సవరించుకో గలుగుతారా? ఇలాంటి ప్రశ్నలు ఏవో నాలో నేనే వేసుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాను.

సాయంత్రం వచ్చిన డాక్ తీసుకుని వచ్చాడు హాస్పిటల్ నుంచి వార్డు బాయ్. నన్ను బదిలీ చేసినట్లు వచ్చిన ఆర్డరు కాపీ ఆ డాక్‌లో ఉంది. నేను దానికి ఆశ్చర్యపడలేదు. కానీ ఆ పిల్లల ఆటల్లో కనబరచిన స్నేహం నా మనసులో తియ్యని కావ్యంలా నిలిచిపోయింది. ఆరోగ్యమైన సహజీవనానికి అది నిర్వచనం అనుకున్నాను.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1_11_89